క్లుప్తంగా

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

యర్రగొండపాలెం: పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తహసీల్దార్ మంజునాథరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక మార్కాపురం రోడ్‌లో ఉన్న పెట్రోలు బంకులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్, డీజిల్ నాణ్యత, మీటర్ రీడింగ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది

దర్శి: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ దర్శి సీడీపీఓ పరిమళ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో దర్శి మండల పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు సంభవించే అంటువ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో వేడిచేసిన నీరు తాగాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ సూచనలు పాటించాలని, ఆశ కార్యకర్తలకు సహకరించాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు ఆర్.ఆనందలత, రమాదేవి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌తో ప్రమాదం
- తెలియక వినియోగిస్తున్న విద్యార్థులు
- తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం మేలు



భోజనం చేస్తున్న విద్యార్థుల వద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు

పుల్లలచెరువు:

పర్యావరణాన్ని నాశనం చేస్తూ పలు వ్యాధులకు ప్లాస్టిక్ కారణమవుతోంది. తెలిసి కూడా రోజూ బడికి వెళ్లే మన పిల్లలకు అవే ప్లాస్టిక్ డబ్బాలతో నీరు పంపుతాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి పిల్లలు అత్యధికంగా ప్లాస్టిక్ సీసాల్లో తెచ్చుకున్న నీటినే తాగుతున్నారు. తల్లిదండ్రుల్లో అవగాహన లేమి, ఆర్థిక పరిస్థితుల కారణంగా నిర్దిష్ట కాలపరిమితిలో వాడిపడేయాల్సిన ప్లాస్టిక్ సీసాలను నెలలు తరబడి వాడుతూ పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు.

హానికరం ఎలా అంటే?

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలైన పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలేల్లో సుమారు 30 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో సుమారు 75 శాతం మంది ప్లాస్టిక్ సీసాల్లోని నీటిని తాగుతున్నారు. ప్లాస్టిక్ సీసాలు రసాయనాలు ఉపయోగించి తయారు చేస్తుంటారు. ఇవి మనిషికి ఆరోగ్యానికి చాలా హానికరం. దీంతో విద్యార్థుల్లో ఇమ్యూనిటీ తగ్గుతూ తరచూ వ్యాధుల బారిన పడేందుకు ఇదో కారణమని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

ప్రస్తుత మార్కెట్‌లో రంగు రంగుల కలర్స్‌లో ప్లాస్టిక్ సీసాలు తక్కువ ధరకు లభిస్తుండటంతో విద్యార్థులు వాటికి ఆకర్షితులై కొనుగోలు చేస్తున్నారు. ప్లాస్టిక్ సీసాల్లో నీరు తాగితే వచ్చే అనర్థాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. గ్రామాల్లోని దాతలను సమీకరించి వారి ద్వారా స్టీల్, రాగి సీసాలు అందించే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉంది.

ప్రభుత్వం చొరవ చూపాలి:



ప్రభుత్వం విద్యార్థులకు వివిధ వస్తువులను కిట్ల రూపంలో పంపిణీ చేస్తోంది. వాటితో పాటు విద్యార్థుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన స్టీలు సీసాలు అందిస్తే వారి ఆరోగ్యాన్ని కొంత మేరకు కాపాడవచ్చు. ప్రభుత్వం చొరవ తీసుకుంటే విద్యార్థులకు కొంత మేరకు న్యాయం జరుగుతుంది.

కె.వెంకటేశ్వర్లు, విద్యార్థి తండ్రి, పుల్లలచెరువు

ప్లాస్టిక్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలి:



ప్లాస్టిక్ వినియోగిస్తే జరిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి. ప్లాస్టిక్ వినియోగిస్తే చాలా అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. చాలా మంది విద్యార్థులు ప్లాస్టిక్ సీసాలనే వినియోగిస్తున్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

డాక్టర్, శ్రీనాథ్, ప్రభుత్వ వైద్యాధికారి, పుల్లలచెరువు



లక్కవరంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



బెల్లంకొండవారిపాలెంలో..

తాళ్లూరు: కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు గువ్వల శ్రీనువాసరెడ్డి, సర్పంచ్ నన్నం వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని లక్కవరం, బెల్లంకొండవారిపాలెం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి గజమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని మండిపడ్డారు. అర్హులకు సైతం పింఛన్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిందని గుర్తుచేశారు. మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, నియోజకవర్గ ప్రచార, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు జక్కుల రామకృష్ణ, యత్తపు మధుసూదన్‌రెడ్డి, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు జగన్నాథం సురేష్, షేక్ లతీఫ్ (బచ్చా), పులి రమణారెడ్డి, కైపు అశోక్‌రెడ్డి, నాగుళ్ల వెంకట్రావు, నారాయణ శెట్టయ్య, సర్పంచ్‌లు కోటా వెంకటరామిరెడ్డి, బాపిరెడ్డి చిన్ననాగిరెడ్డి, ఎంపీటీసీ రావినూతల కోటేష్, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కటకంశెట్టి శ్రీనివాసరావు, పూనూరి దేవదానం, కూలూరి అంజిరెడ్డి, గూడా నారాయణరెడ్డి, గువ్వల సత్యనారాయణరెడ్డి, తూము జయరామిరెడ్డి, సంగు కొండారెడ్డి, కొర్నేలు, ఆంధ్ర కేశవులు, కోటా కృష్ణారెడ్డి, గూడా జయరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, యలమందారెడ్డి, బ్రహ్మారెడ్డి, బాలకృష్ణ, మధు, ఆదినారాయణరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

దళారుల దరిచేరకండి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ నాగేంద్రకుమార్

యర్రగొండపాలెం:

గిరిజనులు బ్యాంకు సేవల కోసం దళారుల దరిచేరకుండా నేరుగా వచ్చి తనతో కలవాలని స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ సి.నాగేంద్రకుమార్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వెంకటాద్రిపాలెం చెంచుగూడెంలో ఐటీడీఏ, అసిస్ట్ సంస్థల ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలు, నీటి సమస్యలు, వాటి పరిష్కారం అనే అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పొదుపు గ్రూపుల మహిళలు రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణాలు పొందొచ్చని, దళారులు, మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, తగిన పత్రాలతో బ్యాంకుకు వచ్చి రుణం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇతరులు ఎవరినీ నమ్మి మోసపోవద్దని కార్యక్రమంలో అసిస్ట్ ప్రాజెక్ట్ హెడ్ ఎం.విష్ణుప్రియ, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ టి.రామారావు, ఫీల్డ్ కో ఆర్డినేటర్ డి.వెంకట్రావు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.వెంకటశివప్రసాద్, విజయవాహిని ఫౌండేషన్ ఎం.శ్రీనివాసరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్ బి.కామ్లానాయక్, బాల లక్ష్మీబాయి, వెంకటేశం, లక్ష్మీబాయి, సర్పంచ్ ఎన్.శ్రీశైలంనాయుడు, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ చెవుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి పోస్టుమన్ తొలగింపు



పోస్టాఫీసు ఎదుట గుమిగూడిన ప్రజలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని మారెళ్లలో పోస్ట్‌మన్‌గా పని చేస్తున్న ప్రసన్నకుమార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు అద్దంకి పోస్టల్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రసన్నకుమార్‌పై గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు మారెళ్లలోని పోస్టాఫీసును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ప్రసన్నకుమార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలతో ఆర్డీలు కట్టించుకుని పోస్టల్‌కు చెల్లించలేదని, ఉత్తరాలు, ఆధార్, పాన్, బ్యాంక్ చెక్‌ల వంటి కవర్లు మూడు నెలలుగా పంపిణీ చేయకుండా తన వద్దే ఉంచుకున్నాడని తెలిపారు. వాటన్నింటినీ చిరునామాల ప్రకారం సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేయిస్తామని చెప్పారు. పోస్టాఫీసు తనిఖీ సందర్భంగా గ్రామస్తులు అక్కడకు భారీగా చేరుకున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని అధికారులకు వివరించారు.

గిరి బలిజ గుర్తింపును రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాపు నాయకులు

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రభుత్వం దొమ్మరి కులస్తులను గిరి బలిజగా గుర్తిస్తూ జీఓ ఇచ్చిందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ సీహెచ్ కృష్ణ మోహన్‌కు కాపు సంఘ నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. తక్షణమే గిరి బలిజ గుర్తింపును రద్దు చేయాలనిడిమాండ్ చేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఆవుల వెంకటేశ్వర్లు, పి.చిన్న వెంకటేశ్వర్లు, బీవీ నరసింహారావు, జి.శ్రీను, వై.సూర్యనారాయణ, మల్లికార్జున్, గురునాథం, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కనిగిరిలో 'మీ కోసం'


కురిచేడు: కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రజని కుమారి తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు. కురిచేడు మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఆ రోజు ఒంగోలు వెళ్లకుండా కనిగిరిలో జరిగే మీకోసం కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడంలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సచిన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుచ్చలమిట్ట 5వ లైన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పుచ్చల మిట్టలోని 4, 5వ లైన్‌ల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



త్రిపురాంతకంలో..



కురిచేడు: జ్ఞానప్రసూనాంబదేవిని స్పృశిస్తున్న సూర్యకిరణాలు



పుల్లలచెరువు: అన్నపూర్ణాదేవిగా..



దర్శి: మహాకాళికాదేవిగా కనకదుర్గమ్మ



దర్శి: కాత్యాయనీదేవిగా పోలేరమ్మ తల్లి



పెద్దారవీడు: రాజంపల్లెలో పూజలు చేస్తున్న భక్తులు

మహాకాళికాదేవిగా కనకదుర్గమ్మ



మీనాక్షిదేవిగా శ్రీజ్ఞానప్రసూనాంబదేవి



త్రిపురాంతకం: ప్రత్యేక అలంకారంలో పార్వతీదేవి



అమ్మవారికి నైవేద్యం తెస్తున్న భక్తులు



దొనకొండ: కాత్యాయినీదేవిగా ఈశ్వరీదేవి



వైపాలెం: మహాగాయత్రీదేవిగా అమ్మవారు

దర్శి: విజయదశమి పండగను పురస్కరించుకుని దర్శిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో మహాకాళికాదేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని ఊరేగిస్తూ పొంగళ్లు పొంగించి నివేదన చేశారు. కుంకుమ పూజ, అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. ఆలయంలో హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాకాళికాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దదోర్నాల: దసరా నవరాత్రులు పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆశ్వీయుజ శుద్ధ చతుర్థి నాడు పలు దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జగజ్జననిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, చండీపారాయణం చేశారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. గురువారం వాసవీ అమ్మవారు త్రిపుర సుందరీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు.

దొనకొండ: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆనంద ఆశ్రమంలో వెలసిన ఈశ్వరీదేవి 4వ రోజు శ్రీకాత్యాయనీగా దర్శనమిచ్చారు. పూజారి మణిబాబు శర్మ ఉదయం 7 గంటల నుంచి గణపతి పూజ, అమ్మవారికి అభిషేకాలు చేసి కాత్యాయనీ దేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. విశేష మహా నైవేద్యాలతో మంగళహారతులిచ్చారు. భైరవానంద స్వామి మాట్లాడుతూ 5వ రోజు ఈశ్వరదేవి మహాదేవి ధనలక్ష్మీదేవిగా దర్శనం ఇస్తుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దొండపాడు గ్రామానికి చెందిన ఇరిగినబోయిన పాపారాయుడు, ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అల్పాహారం భక్తులకు అందజేశారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుంటున్నారు. పలు ఆలయాల్లో గురువారం నాలుగో రోజు అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో కుంకమపూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని స్పృశించిన సూర్యకిరణాలు

కురిచేడు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలోని శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి మూలవిరాట్‌ను గురువారం సూర్యకిరణాలు స్పృశించాయి. ఆలయ ప్రాంగణంలో శ్రీ కాళహస్తీశ్వరస్వామి, శ్రీజ్ఞానప్రసూనాంబ ఆలయాలు పక్కపక్కనే ఉన్నాయి. గర్భగుడులు, మూల విరాట్‌లు సమాంతరంగా ఉన్నాయి. సూర్యకిరణాలు అమ్మవారిని స్పృశించి స్వామి వారిని తాకకపోవడంతో భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేవి శరన్నవరాత్రుల్లో అమ్మవారిని సూర్యనారాయణస్వామి సేవించటాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించి అమ్మవారిని భక్తితో కొనియాడారు.

యర్రగొండపాలెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం మహా గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం శ్రీదత్తాష్టక పారాయణం, రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత కొప్పుకొండ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లె సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతం, అభిషేకాలు, కుంకుమ పూజలు, కలశం పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కురిచేడు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు గురువారం శ్రీజ్ఞానప్రసూనాంబదేవి భక్తులకు శ్రీమీనాక్షిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యే పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి దసర శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కూష్మాండదుర్గ అలంకారంలో శేషవాహన సేవ వైభవంగా జరిగింది. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో దసర శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రోజూ ప్రత్యేక పూజలు, ఉభయదాతల పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు కూష్మాండదుర్గ ప్రత్యేక అలంకారంలో శేషవాహనసేవను భక్తజనులు వైభవంగా నిర్వహించారు.

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో దసర నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పార్వతీదేవి మూలవిరాట్ ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. త్రిపురాంతకంలోని స్వామి వారి ఆలయంలో దసర శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.